క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు గురువార ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సాయినాథునికి క్షీరం, వట్టివేర్లతో అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం సాయినాథ, దక్షిణామూర్తి హోమం వేద పండితులచే జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

జ్యోత్స్న సామాజిక సేవలు వెలకట్టలేనివి

విజయవాడకల్చరల్: సుంకర జ్యోత్స్న సామాజిక సేవలు వెలకట్టలేనివని కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. జ్యోత్స్న మృతికి సాంస్కృతిక సంస్థల పక్షాన గురువారం సంతాపం వ్యక్తం చేశారు. తమ కుటుంబంతో 50 సంవత్సరాల అనుబంధం ఉందని ఆమె మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. మహిళల హక్కుల కోసం ఆమె చేసిన కృషిని సేఫ్ మహిళా సాధికారిక సంస్థ ఉపాధ్యక్షురాలు తుమ్మల విజయలక్ష్మి కొనియాడారు. సూర్యారావుపేటలోని జ్యోత్స్న స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి సేఫ్ సంస్థ సభ్యులు జి.వాణి, నీరజ, సత్యవాణి, వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ల వాణి, డీవీ రాజు, ఎమ్మెస్కో విజయకుమార్, లక్ష్మయ్య, రాంపిళ్ల జయప్రకాష్ నివాళులర్పించారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి



నున్న(విజయవాడరూరల్): ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, న్యూ రాజీవ్ నగర్, పాయకాపురం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్ తెలిపారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఉచిత వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద మొబైల్ హెల్త్ కేర్ షెడ్యూల్డ్ కులాల ప్రణాళికలో భాగంగా ప్రతి సోమ, గురువారాల్లో ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయుర్వేద వైద్యం ఆరోగ్యానికి మంచి ఫలితాలను ఇస్తుందని చెప్పారు. శిబిరంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రతన్ టాటాకు కేశినేని నాని నివాళి



విజయవాడస్పోర్ట్స్: టాటా గ్రూప్స్ చైర్మన్ రతన్ టాటా పార్థివ దేహానికి విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) నివాళులర్పించారు. ముంబైలోని నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ గ్రౌండ్స్‌లో ఉంచిన రతన్ టాటా పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు, టాటా గ్రూప్స్ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేశినేని నానితో పాటు ఆయన కుమార్తె కేశినేని శ్వేత ఉన్నారు.



రామకృష్ణాపురం శ్రీదుర్గాభవానీ దేవాలయంలో అమ్మవారు




బావాజీపేటలో విశేష అలంకరణలో అమ్మవారు



బాబూరావు మేడ సెంటర్‌లో దుర్గాదేవీగా..



శ్రీపార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో..



లబ్బీపేటలో శారదా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



దత్తసాయి శివకామేశ్వరీపీఠంలో దుర్గాదేవి అమ్మవారు



అంకమ్మతల్లి శక్తి పీఠంలో కుంకుమార్చనలు నిర్వహిస్తున్న భక్తులు



మధురానగర్‌లో సామూహిక కుంకుమార్చనలు

- దుర్గాదేవీగా దర్శనమిచ్చిన అమ్మవార్లు
- ఆలయాల్లో విశేష పూజలు, కుంకుమార్చనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీదుర్గాదేవీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలంటూ పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ రుద్రహోమం, చండీహోమం, కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీ దుర్గా దేవిగా అలంకరించి పూజలు, కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు తాన్న పూర్ణచంద్రరావు, దుర్గారావు, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు

వాడవాడలా పూజలు..

ముత్యాలంపాడు శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా పూజలు అందుకున్నారు. బావాజీపేటలో బచ్చుమాధవీకృష్ణ ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బచ్చు మురళీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. సుహాసినీ పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. కార్పొరేటర్ వీరమాచనేని లలిత పాల్గొని భక్తులతో కలిసి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో గుడిపాటి దత్తు ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. అలాగే మధురానగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, రామకృష్ణాపురం శ్రీ దుర్గా భవానీ మందిరంలో అమ్మవారిని శ్రీ దుర్గా దేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. దుర్గాభవాని మందిరంలో మందిర వ్యవస్థాపకుడు దెందుకూరి వెంకట్రామరాజు కుంకుమార్చనలు, అర్చనలు నిర్వహించారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి.

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత రామకోటిలో శారదాదేవిని ధైర్యలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మాధికారి పర్యవేక్షణలో వేద పండితులు వేద సభను నిర్వహించారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

తుది దశకు చేరుకున్న పైపులైన్ పనులు



దేవీనగర్ వంతెన వద్ద జరుగుతున్న పైపులైన్ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద వల్ల ధ్వంసమైన పైపులైన్ మార్పిడి పనులు తుది దశకు చేరుకున్నాయి. మధురానగర్ నుంచి దేవీనగర్ వైపు ఫుట్‌బ్రిడ్జి మీదుగా వాటర్, యూజీడీ పైపులైన్లు ఉండేవి. ఇటీవల వరద ఈ పైపులైన్ల మీదుగా వెళ్లింది. దీంతో పలు పైపులు పాడవ్వటంతో అధికారులు ఫుట్‌బ్రిడ్జి మీద పైపులైన్లను దేవీనగర్ వంతెన మీదుగా మార్చివేశారు. గత వారం రోజులుగా పైపులైన్ మార్పిడి పనులు జరుగుతున్నాయి. గురువారం పనులు తుదిదశకు చేరుకున్నాయి.

వైభవంగా జ్యోతుల మహోత్సవం



భక్తులకు జ్యోతులు అందజేస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి దయ అందరికీ లభించాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. స్థానిక విజయదుర్గానగర్‌లో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జ్యోతుల మహోత్సవం వైభవంగా జరిగింది. విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రతీ ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం భక్తులకు జ్యోతులను అందజేశారు. భక్తులు జ్యోతులతో దేవీనగర్, మధురానగర్ తదితర ప్రాంతాల మీదుగా ఇంద్రకీలాద్రికి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మార్తి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అందజేత



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న హరివిల్లు ఫౌండేషన్ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బంది పడిన భవానీపురం, కామకోటినగర్, రామరాజ్యనగర్, రాజరాజేశ్వరిపేట, సింగ్‌నగర్ ప్రాంతాల్లోని విద్యార్థులకు హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు ఎం.బాలసూర్యనారాయణ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ సభ్యుడైన ఎం.వి. చంద్రమోహన్ ప్రతి ఏడాది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వరదల కారణంగా పుస్తకాలు కోల్పోయిన సుమారు 250 మంది విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా నోట్ బుక్స్ అందించడం సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ సభ్యులు సేవలను అందించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యు.కనకారావు, కార్యవర్గ సభ్యురాలు ఎం.శ్రీదేవి, సభ్యులు ఎం.డి.నజీర్, పి.రాజేష్, ఇర్షాద్, కె.లలిత పాల్గొన్నారు.

కళింగ కోమటి సంఘం ఆధ్వర్యంలో....

ఎన్టీఆర్ జిల్లా కళింగ కోమటి సంఘం ఆధ్వర్యంలో 80 మందికి వస్త్రాలు, నిత్యావసర సరుకుల కిట్‌తో పాటు రూ.2,200 నగదును అందజేశారు. నందమూరి నగర్, శ్రీభారత మాత మందిరంలో కళింగ కోమటి సేవా సంఘం అధ్యక్షుడు వడ్డి శ్రీనివారావు సరుకులు అందజేశారు. సంఘం ఉపాధ్యక్షులు పెద్దిన తిరుమలరావు, నాగభూషణరావు, గోపాలశెట్టి సత్యనారాయణ, కొత్తకోట నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..!



దావు బుచ్చయ్య కాలనీ - గుణదల రోడ్డు దుస్థితి

మధురానగర్(విజయవాడ సెంట్రల్): 30వ డివిజన్ వాసుల పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇక్కడ చినుకు పడితే చాలు చిత్తడిగా మారిపోతుంది. ముఖ్యంగా దేవీనగర్ రైల్వే బ్రిడ్జి వద్ద గోతుల్లో వర్షపునీరు నిలిచిపోతున్నాయి. ఇక్కడ నీరు బయటకు పోయే మార్గం లేకపోవటంతో వర్షపునీటి వల్ల గోతులు మరింత పెద్దగా మారుతున్నాయి. తరచూ పలువురు ఇక్కడ గోతులలో పడి గాయాల బారిన పడుతున్నారు. అలాగే దావు బుచ్చయ్యకాలనీ – గుణదల రోడ్డు కొద్దిపాటి వర్షానికే బురదగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడ కూడా వర్షపునీరు బయటకు పోయే పరిస్థితి లేదు. పక్కనే బుడమేరు ఉన్నప్పటికీ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవటం వల్లే వర్షపునీరు నిలిచిపోతుందని ఆరోపిస్తున్నారు. దోమలు సైతం విజృంభిస్తున్నాయి. దోమల వల్ల తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుబజారులో సబ్సిడీపై నూనెల విక్రయం




పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం రైతుబజారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో వంట నూనెల విక్రయాలను గురువారం ఏఎస్ఓ-3 ఎస్.లక్ష్మణ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీన ఆదేశాల మేరకు పాయకాపురం రైతుబజారులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి వినియోగదారులకు ఆయిల్ విక్రయాలు నిర్వహిస్తున్నామన్నారు. పామోలిన్ కిలో ప్యాకెట్ రూ.115, ఉల్లిపాయలు కేజీ రూ.33, టమాట కేజీ రూ.50లకు విక్రయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శరత్ బాబు, వెంకటకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ టెట్ పరీక్షకు 1,605 మంది హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ టీఈటీ -2024 ఆన్‌లైన్ పరీక్షలు గురువారం ఎనిమిదో రోజు ప్రశాంతంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక జిల్లాతో పాటుగా ఖమ్మం జిల్లాలోని తొమ్మిది పరీక్షా కేంద్రాలను కేటాయించారు. అందులో ఆరు కేంద్రాల్లో గురువారం పరీక్షను నిర్వహించారు. ఎనిమిదో రోజు జరిగిన పరీక్షలో రెండు షిఫ్టులు కలిపి 1903 మంది అభ్యర్థులను కేటాయించగా అందులో 1605 మంది హాజరయ్యారు. 293 మంది గైర్హాజరయ్యారు. శ్రీవాహిణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, (తిరువూరు), పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (విజయవాడ), ఐయాన్ డిజిటల్ జోన్ (కంచ్రిక, విజయవాడ), ఎస్వీ ఇన్ఫోటెక్ (రామమందిరం రోడ్డు విజయవాడ), లైఫ్‌బ్రిడ్జి ఇన్ఫో టెక్నాలజీస్(గొల్లపూడి విజయవాడ), శ్రీ విజయదుర్గా ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు విజయవాడ రూరల్) తదితర పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగాయి. ఉదయం షిఫ్టుకు సంబంధించి 1,191 మంది అభ్యర్థులను కేటాయించగా 1,016 మంది హాజరయ్యారు. 175 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్టుకు సంబంధించి 712 మంది అభ్యర్థులను కేటాయించగా 589 మంది హాజరయ్యారు. 123 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

5 వేల మందికి అన్నదానం



మధురానగర్(విజయవాడ సెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దావు బుచ్చయ్యకాలనీ గ్రామదేవత శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన 5వేల మందికి అన్నదానం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.

వీఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండండి

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాలు ముగింపునకు చేరుకుంటున్నందున భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం ఆయా శాఖల అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ భక్తుల తాకిడి నేపథ్యంలో గుడి పరిసరాలు, స్నాన ఘాట్లలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లో భక్తులు వదిలేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. తాగునీటి ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి పాయింట్లలో స్టాక్ ఉండేలా ప్రణాళిక చేసుకోవాలని, స్టాక్ పాయింట్లలో ఉన్న స్టాక్‌లను గంట గంటకు తనకు నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

షాలేమ్ రాజుకు సన్మానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎన్‌వైఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీల్లో పారుపల్లి షాలేమ్ రాజు ప్రతిభ చూపి రెండు విభాగాల్లో ప్రథమ స్థానం పొందడం అభినందనీయమని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ నాగేశ్వరరావు అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని సంఘం కార్యాలయంలో షాలేమ్ రాజు అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన రాజు ఈ విధంగా ప్రతిభ చూపడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ, సంఘం కోశాధికారి లావణ్యకుమార్, సభ్యులు యల్లారావు, సురేంద్ర, వెంకట్, మహిపాల్, సిరాజ్‌తో పాటుగా యోగ సాధకులు అభినందనలు తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పనిప్రదేశాల్లో మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని శ్రీ మానస సైకియాట్రి నర్సింగ్ హోం వైద్యులు కాజ మానస అన్నారు. ఇందుకు కారణంగా స్ట్రెస్, యాంగ్జయిటీ, డిప్రెషన్ వంటివి పని సామర్థ్యాన్ని దెబ్బ తీస్తున్నాయన్నారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు, 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ కార్యాలయంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయము ఇది అనే థీమ్‌తో వారోత్సవాలు నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా మారుతున్న కాల మాన పరిస్థితుల వలన పని ప్రదేశంలో మానసిక ఒత్తిడి అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు గల కారణాలను విశ్లేషించారు. డ్రగ్స్, మద్యపానం, డిజిటల్ ఎడిక్షన్స్ వంటివి ప్రధాన కారమని పేర్కొన్నారు. నివారణ మార్గాలను వివరించారు.

వాంబేకాలనీలో మెగా వైద్యశిబిరం



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నట్లు క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ ఎ.రమేష్ పాల్ తెలిపారు. వాంబేకాలనీలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. రమేష్ పాల్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 15 ప్రాంతాల్లో వైద్య నిపుణులతో మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా వైద్య సేవలందించామన్నారు. వాంబేకాలనీ, పాయకాపురం, శాంతినగర్‌కు చెందిన వెయ్యి మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ కాదీష్‌బాబు, డాక్టర్లు సూరెడ్డి అరవింద్, ఈ.ఝాన్సీలక్ష్మి, డి.వరుణ్, వి.విజయ్ కుమార్, డి.తరుణ్ శివకుమార్, పాస్టర్ పి.ప్రభుభూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.